సాక్షి అనంతపురం

శనివారం ♦ 15 ♦ జూలై ♦ 2023



చీనీ టన్ను రూ.19 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.19 వేలు పలికాయి.



టమాట గరిష్ట ధర రూ.126

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.126, కనిష్టం రూ.100, సరాసరి రూ.116 పలికింది.



జిల్లా అంతటా శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం తగ్గింది. ఉక్కపోత పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

చంద్రయాన్‌-3 సక్సెస్‌పై హర్షం



గుంతకల్లుటౌన్‌: చంద్రుని దక్షిణ ధ్రువంపైకి అడుగిడేందుకు చంద్రయాన్‌-3 మిషన్‌ను పంపిన ఇస్రో (భారత అంతరిక్ష పరిశోధన సంస్థ)కు అంతా మంచి జరగాలని గుంతకల్లు రోటరీ హైస్కూల్‌ విద్యార్థులు ఆకాంక్షించారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులు అక్షర క్రమంలో కూర్చుని 'ఆల్‌ ది బెస్ట్‌ ఇస్రో' అని నినదించారు.

ప్రత్యామ్నాయానికి సిద్ధం కండి

గార్లదిన్నె: వర్షాల రాక ఆలస్యమైతే ప్రత్యామ్నాయ పంటలు సాగుకు రైతులు సిద్ధం కావాలని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) ఉమామహేశ్వరి రైతులకు సూచించారు. శుక్రవారం గార్లదిన్నె ఆర్బీకేలో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వేరుశనగ, కంది సాగు చేయాలనుకున్న రైతులు నెలాఖరులో కూడా వర్షం రాకపోతే ఉలవ, జొన్న, రాగి, కొర్ర వంటి ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ రవి, ఎంపీపీ వెంకటనారాయణ, హెచ్‌ఓ ధనుంజయ, పశువైద్యాధికారి డాక్టర్‌ రమేష్‌, మత్స్యశాఖ ఎఫ్‌డీఓ ఆసీఫ్‌, మండల ఏఓ అధికారి సోమశేఖర్‌, రైతులు పాల్గొన్నారు.

ప్రతి శిశువుకూ టీకాలు

అనంతపురం క్రైం: ప్రతి శిశువుకూ పూర్తి స్థాయిలో వ్యాధి నిరోధక టీకాలు అందించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ యుగంధర్‌ వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ ద్వారా వైద్యాధికారులకు 'మిషన్‌ ఇంద్రధనస్సు' కార్యక్రమంపై శిక్షణ నిర్వహించారు. శిశువులకు వ్యాధి నిరోధక టీకాలు అందించడమే 'మిషన్‌ ఇంద్రధనస్సు' కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. టీకాలు అందించడం ద్వారా టీబీ, కోరింత దగ్గు, ధనుర్వాతం, న్యుమోనియా, పోలియో, తట్టు, మెదడువాపు తదితర వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్‌ చెన్నకేశవులు, ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వేలెన్స్‌ అధికారి డాక్టర్‌ భవాని, డాక్టర్‌ మనోజ్‌, డాక్టర్‌ మహేంద్రనాథ్‌, డాక్టర్‌ శ్రీ హర్ష పాల్గొన్నారు.

జిల్లాకు 1,232 మెట్రిక్‌ టన్నుల ఎరువులు

అనంతపురం అగ్రికల్చర్‌: ఖరీఫ్‌ ఎరువుల ప్రణాళికలో భాగంగా నెలవారీ కోటా మేరకు శుక్రవారం స్మార్ట్‌ కెమికల్‌ కంపెనీ నుంచి 1,232 మెట్రిక్‌ టన్నుల ఎరువులు జిల్లాకు సరఫరా అయినట్లు రేక్‌ ఆఫీసర్‌, ఏడీఏ రవి తెలిపారు. రాప్తాడు ఏఓ వెంకటేశ్వర ప్రసాద్‌తో కలసి ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్‌కు వెళ్లి వ్యాగన్ల ద్వారా వచ్చిన ఎరువులు పరిశీలించారు.

తాడిపత్రి పట్టణ సీఐగా హమీద్‌ ఖాన్‌

అనంతపురం శ్రీకంఠం సర్కిల్‌ : తాడిపత్రి పట్టణ సీఐగా పి.హమీద్‌ఖాన్‌ నియమితులయ్యారు. ఇక్కడ సీఐగా ఉన్న ఆనందరావు కుటుంబ సమస్యలతో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. దీంతో ఖాళీగా ఉన్న ఈ పోస్టులో శ్రీసత్యసాయి జిల్లాలో వీఆర్‌లో ఉన్న హమీద్‌ఖాన్‌ను నియమిస్తూ డీఐజీ అమ్మిరెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పట్టు కోసం పాకులాట

- జేసీ ప్రభాకర్‌ బరితెగింపు..
- ఆధిపత్యం కోసం అరాచకం
- అధికారులపై విపరీతమైన పెత్తనం
- దిగజారుడు రాజకీయాలతో ప్రజల్లో ఛీత్కారాలు

మూడు దశాబ్దాల రాజకీయాధిపత్యం కొనసాగించిన జేసీ సోదరులను 2019 ఎన్నికలు కోలుకోలేని దెబ్బతీశాయి. అప్పటివరకు అప్రతిహతంగా గెలుస్తూ వచ్చిన జేసీ దివాకర్‌రెడ్డి– జేసీ ప్రభాకర్‌రెడ్డి సోదర ద్వయం సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాభవం చవిచూడాల్సి వచ్చింది. నైరాశ్యంలోకి వెళ్లిపోయిన మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి, ఆయన కుమారుడు జేసీ పవన్‌ రాజకీయాలకు చాలావరకు దూరంగా ఉంటున్నారు. ఇక దివాకర్‌రెడ్డి తమ్ముడు, మున్సిపల్‌ చైర్మన్‌ అయిన జేసీ ప్రభాకర్‌రెడ్డి తాడిపత్రి నియోజకవర్గంలో తిరిగి పట్టుకోసం పాకులాడుతున్నారు. ఈ క్రమంలో ఆయన వెకిలి చేష్టలు, దిగజారుడు రాజకీయాలతో ప్రజల్లో ఛీత్కారాలకు గురవుతున్నారు.

తాడిపత్రి: టీడీపీ నేత, మున్సిపల్‌ చైర్మన్‌ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆధిపత్యం కోసం పేట్రేగిపోతున్నారు. అధికారులను తన గుప్పిట్లో పెట్టుకోవడానికి సామదానభేద దండోపాయాలు ప్రయోగిస్తున్నారు. ఇక్కడ మున్సిపల్‌ కమిషనర్‌గా పనిచేసిన జబ్బార్‌మియా తాను చెప్పినట్టు నడుచుకోలేదని కక్ష గట్టారు. మున్సిపల్‌ కార్యాలయాన్ని ముట్టడించి, అక్కడే వంటా వార్పుతో పాటు కాలకృత్యాలు తీర్చుకోవడం, అసత్య ఆరోపణలు చేయడం విమర్శలకు తావిచ్చింది. మరీ ఇంత దిగజారుడు అవసరమా అని టీడీపీలోనే కొందరు నాయకులతో పాటు ప్రజలు కూడా తప్పుపట్టారు.

- కొద్ది రోజుల క్రితం తాడిపత్రి అర్బన్‌ సీఐ ఆనందరావు ఆత్మహత్యను స్వార్థరాజకీయాలకు జేసీ ప్రభాకర్‌రెడ్డి వాడుకున్నారు. సీఐ ఆత్మహత్యకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కారణమని, సాక్ష్యాలు చెరిపేశారని, ఇందుకు సంబంధించిన అన్ని ఆధారాలూ తన వద్ద ఉన్నాయని మీడియా ముందు చిందులేస్తూ నవ్వులపాలయ్యారు.
- మొన్నటికి మొన్న వైఎస్సార్‌ ఉచిత పంటల బీమాపై కనీస అవగాహన లేకుండానే ఎమ్మెల్యే పెద్దారెడ్డి కుటుంబ సభ్యులకు బీమా పరిహారం ఎలా వస్తుందంటూ ప్రభాకర్‌రెడ్డి విమర్శలు చేశారు. పొలంలో మొక్కలు లేవని ఒక రోజు, కాయలు కాయని చెట్లకు పరిహారం ఎలా ఇచ్చారని మరో రోజు, ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు బీమా నొక్కేశారంటూ ఇంకోరోజు అర్థపర్థం లేని ఆరోపణలు చేశారు.
- అధికార పక్షాన్ని, ఎమ్మెల్యేను విమర్శించేందుకు టీడీపీలో సరైన నాయకులు ఎవ్వరూ లేకపోవడంతో ప్రభాకర్‌రెడ్డి ఓ మహిళను అడ్డుపెట్టుకుని రాజకీయం చేశాడు. దాదాపు 12 కేసులు నమోదై, జైలు శిక్ష అనుభవించి వచ్చిన ఓ దళిత సామాజిక వర్గానికి చెందిన మహిళతో పంటల బీమాపై చేయించిన వ్యాఖ్యలను ప్రజలు నమ్మలేదు.



నోటి దురుసు ఎక్కువే..

కాంగ్రెస్‌ నుంచి టీడీపీలోకి వచ్చిన జేసీ సోదరుల చేరికను టీడీపీలోని చాలామంది నాయకులు జీర్ణించుకోలేకపోయారు. వారు ఏ పార్టీలో ఉన్నా ఆధిపత్యం ప్రదర్శిస్తూ.. మిగిలిన వారిని ఎదగనీయకుండా తొక్కిపడేస్తారనేది వారి భయం. వారి నోటిదురుసుకు జడిసేవారు. చేసేదిలేక 2019 ఎన్నికల ముందు వరకు భరిస్తూ వచ్చిన కొందరు కీలకమైన నాయకులు, కార్యకర్తలు కేతిరెడ్డి పెద్దారెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. జేసీ సోదరుల మూడు దశాబ్దాల పాలనలో మేలు కన్నా కీడే ఎక్కువని భావించిన ప్రజలు పెద్దారెడ్డికి పట్టం కట్టారు. జేసీ సోదరుల రాజకీయ పతనానికి నాంది పలికారు.

నోరు అదుపులో పెట్టుకో

- లేకుంటే నీ అవినీతి చిట్టా విప్పుతా
- కాలవ శ్రీనివాసులుకు ఎమ్మెల్యే పెద్దారెడ్డి హెచ్చరిక



తాడిపత్రి అర్బన్‌: టీడీపీ జిల్లా అధ్యక్షుడు కాలవ శ్రీనివాసులు నోరు అదుపులో పెట్టుకోవాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి హెచ్చరించారు. లేకుంటే నీ అవినీతి చిట్టా మీడియా ముందు విప్పుతానన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్‌లో ఉన్నపుడు జేసీ సోదరుల దౌర్జన్యాలు, దాష్టీకాలకు బలైన టీడీపీ కార్యకర్తలను, వారి కుటుంబాలను ఏనాడైనా పరామర్శించావా అని కాలవను ప్రశ్నించారు. జేసీ సోదరుల అరాచకాలపై ఏనాడైనా నోరు విప్పావా అని నిలదీశారు. త్రిశూల్‌ సిమెంట్‌ కంపెనీ వ్యవహారంలో భూముల పరిశీలనకు వచ్చిన మీరు జేసీ సోదరుల ఇంటిలోనే భోజనం చేసి వెళ్లిన విషయం తెలుసన్నారు. జేసీ సోదరుల ఆగడాలు తట్టుకోలేక శరణు కోరి వచ్చిన టీడీపీ కార్యకర్తలకు అభయ హస్తం ఇవ్వకపోగా.. తాడిపత్రి విషయంలో జోక్యం చేసుకోలేమని చేతులెత్తేసిన విషయం మరచిపోయావా అని ప్రశ్నించారు. పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనకుండా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న జేసీ ప్రభాకర్‌రెడ్డిపై జిల్లా అధ్యక్షుని హోదాలో ఎందుకు చర్యలు తీసుకోలేకపోయారో జిల్లా ప్రజలందరికీ తెలుసన్నారు. రాయదుర్గంలో జేసీ అల్లుడు నీకు పోటీ తగులుతాడనే భయంతోనే ప్రభాకర్‌రెడ్డి విషయంలో నోరు మెదపడం లేదన్నారు. సాధారణ జర్నలిస్టుగా ప్రస్థానం ప్రారంభించి రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత రూ.300 కోట్లకు ఎలా పడగలెత్తావో, నీ అవినీతి బాగోతమంతా నా చేతిలో ఉందని, త్వరలోనే మీడియా ముందు బయట పెడతానని కాలవను హెచ్చరించారు. తన పార్టీ గురించి గొప్పలు చెబుతున్న కాలవ శ్రీనివాసులు టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చింబిలి వెంకటరమణ ఎంత అవినీతిపరుడో ఒక్కసారి తెలుసుకోవాలని హితవు పలికారు. గన్నెవారిపల్లి పంచాయతీలో ఎన్ని అక్రమాలకు పాల్పడ్డాడో నీకు తెలుసా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. అందరి జాతకాలు తన దగ్గర ఉన్నాయని, సమయం వచ్చినపుడు బయట పెడతానని చెప్పారు.

అభివృద్ధి పనులు గడువులోపు పూర్తి చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్‌ గౌతమి

అనంతపురం అర్బన్‌: జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులు గడువులోపు పూర్తి చేయాలని కలెక్టర్‌ గౌతమి అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల ప్రగతిపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్‌.జవహర్‌రెడ్డి శుక్రవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో పనుల పురోగతిపై సీఎస్‌కు కలెక్టర్‌ వివరించారు. అభివృద్ధి పనులు వేగవంతం చేశామని చెప్పారు. బడిబయట పిల్లలను 100 శాతం బడిలో ఉండేలా చర్యలు చేపట్టామన్నారు. ఇప్పటికే విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశామని చెప్పారు. సీఎస్‌ వీడియో కాన్ఫరెన్స్‌ అనంతరం అధికారులతో కలెక్టర్‌ సమీక్షించారు. అభివృద్ధి పనుల విషయంలో రోజూ పురోగతి చూపించాలని ఆదేశించారు. ఏ దశలోనూ అలసత్వానికి తావివ్వకూడదన్నారు. అన్ని అంశాల్లోనూ జిల్లా ముందంజలో ఉంచేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు.

ఓడీఓపీ కేటాయించిన కేంద్రం

ఓడీఓపీ (వన్‌ డిస్ట్రిక్ట్‌ వన్‌ ప్రొడెక్ట్‌) అవార్డుకు సంబంధించి జిల్లాకు కాటన్‌, జీన్స్‌ ప్యాంట్‌ ప్రొడక్ట్‌ను కేంద్ర ప్రభుత్వం కేటాయించిందని కలెక్టర్‌ చెప్పారు. ఈ నేపథ్యంలో ఈ నెల 31లోపు ఆన్‌లైన్‌ ద్వారా ప్రతిపాదనలు అప్‌లోడ్‌ చేయాలని చేనేత జౌళి శాఖ అధికారిని ఆదేశించారు.

ఆగస్టులో సామూహిక గృహప్రవేశాలు

ఆగస్టులో సామూహిక గృహప్రవేశాలు చేపట్టనున్నట్లు కలెక్టర్‌ గౌతమి తెలిపారు. ఇళ్ల నిర్మాణం పురోగతిపై కలెక్టర్‌ శుక్రవారం క్యాంపు కార్యాలయం నుంచి మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ నిర్వహించారు. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం జగనన్న కాలనీలు నిర్మిస్తోందన్నారు. జిల్లావ్యాప్తంగా ఈ నెలాఖరుకు 19,193 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించగా.. ఇప్పటి వరకు 15,976 ఇళ్లు పూర్తి చేశారన్నారు. మిగిలిన 3,222 ఇళ్లను రెండు వారాల్లోగా పూర్తి చేయాలని చెప్పారు. హౌసింగ్‌ పీడీ కేశవనాయుడు, డీఈ లక్ష్మీనారాయణమ్మ, జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, మెప్మా పీడీ విజయలక్ష్మి పాల్గొన్నారు.

పోలీసు శాఖలో సమర్థతకే పెద్దపీట

- సీఐల పోస్టింగుల్లోనూ సామాజిక న్యాయం
- కీలక స్థానాల్లో బీసీలు, ఎస్సీ వర్గాల వారే సీఐలుగా విధులు
- 31 మంది సీఐలలో 21 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలే
- కులాల కుంపట్లు రాజేయాలని తమ వర్గం మీడియాను ఉసిగొల్పుతున్న టీడీపీ



సాక్షి ప్రతినిధి, అనంతపురం: జిల్లాలో వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ ఎస్సీ, బీసీలకు ఎలా సముచిత స్థానం కల్పించిందో ప్రభుత్వ పరంగా కూడా పోలీసు విభాగంలో అంతే స్థాయిలో అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించింది. సమర్థతకు పెద్దపీట వేస్తూ సీఐలకు పోస్టింగ్‌లు ఇచ్చింది. సీఐల్లో 67 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఉండటం గమనార్హం. తాజాగా ఓ వర్గ మీడియా ఒకే సామాజికవర్గానికి చెందిన వారికి పోస్టింగ్‌లు ఇచ్చారని పేర్కొంది. దీనిపై పోలీసు వర్గాలూ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. జిల్లాలో 31 మంది సీఐలలో 13 మంది బీసీలు, నలుగురు ఎస్సీలు, ఒక ఎస్టీ, ముగ్గురు మైనార్టీలు ఉండటం విశేషం.

అనంతపురం అర్బన్‌లో బీసీలే

అనంతపురం అర్బన్‌లో ఐదుగురు సీఐలుండగా.. అందులో ముగ్గురు బీసీలే ఉన్నారు. వన్‌టౌన్‌, టూ టౌన్‌, త్రీటౌన్‌ స్టేషన్‌లలో బీసీలే సీఐలుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఒక్క ఫోర్త్‌ టౌన్‌లో మాత్రమే రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారున్నారు. అంతే కాదు గుంతకల్లు, ఉరవకొండ, కళ్యాణదుర్గం వంటి కీలకమైన ప్రాంతాల్లో బీసీలు పోలీసు అధికారులుగా ఉన్నారు. సమర్థతను ప్రాతిపదికగా చేసుకుని పోస్టింగ్‌లు ఇస్తున్నప్పటికీ 'పచ్చ' పత్రికలు కులాలను ఆధారంగా చేసుకుని రాస్తే తెలుగుదేశం పార్టీకి ఆయాచిత లబ్ధి జరుగుతుందేమోనని అత్యాశపడుతున్నాయని కొంత మంది నిపుణులు విశ్లేషిస్తున్నారు.

రాజకీయంగా మైలేజీ కోసం

జిల్లాలో లోకేష్‌ యువగళం, టీడీపీ నాయకుల బస్సు యాత్ర వంటివి చేసినా పార్టీ పరిస్థితిలో ఏమాత్రమూ మార్పు లేదు. ప్రస్తుత ప్రభుత్వంలో అన్ని సామాజిక వర్గాలకు, రాజకీయ పార్టీల కార్యకర్తలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్నారు. దీంతో తెలుగుదేశం పార్టీ తమ వర్గ మీడియాను అడ్డుపెట్టుకుని విభేదాలు సృష్టించాలని యత్నిస్తోంది. కానీ పార్టీ పరిస్థితి దయనీయంగా ఉందని, ఇలాంటి వ్యూహాలు ఏ మాత్రమూ పనికిరావని కొంతమంది రాజకీయ నాయకులు చెబుతున్నారు. ఎక్కడ చూసినా వర్గపోరు, తన్నులాటలు, కుమ్ములాటలతో ఉన్న పార్టీకి మీడియా ద్వారా ఎన్ని చేసినా పరిస్థితుల్లో మార్పు రాదని, జాకీలు పెట్టి లేపినా లేసే పరిస్థితి లేదని సామాన్య ప్రజలూ భావిస్తున్నారు. కులాల కుంపట్లు రాజేసి లబ్ధిపొందాలని తెలుగుదేశం పార్టీ తమ వర్గ మీడియాను రెచ్చగొడుతున్న తీరు ఆ పార్టీ దుస్థితికి అద్దం పడుతోంది.

విన్నాడు.. ఆదుకున్నాడు...



కళ్యాణదుర్గంలో సీఎం జగన్‌ను కలిసి విన్నవించుకుంటున్న రామలక్ష్మమ్మ (ఫైల్‌)




రామలక్ష్మమ్మకు చెక్కు అందజేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్‌

- తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులు
- ఆదుకోవాలని ముఖ్యమంత్రిని కోరిన అవ్వ
- కుటుంబానికి ఆసరాగా రూ.2లక్షల చెక్కు అందజేత
- కృతజ్ఞతలు తెలిపిన లబ్ధిదారు

కళ్యాణదుర్గం: తల్లిదండ్రులను కోల్పోయి అవ్వ సంరక్షణలో ఉన్న పిల్లలకు ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థికసాయం అందించి ఆదుకున్నారు. శెట్టూరు మండలం ఐదుకల్లుకు చెందిన వితంతువు రామలక్ష్మమ్మ ఈ నెల ఎనిమిదో తేదీన కళ్యాణదుర్గం బహిరంగసభలో ముఖ్యమంత్రిని కలిసి తన గోడు వెల్లబోసుకుంది. ఏడాది కిందట కుమారుడు చిత్తన్న రోడ్డు ప్రమాదంలో మరణించాడని, రోజుల వ్యవధిలోనే కోడలూ కన్నుమూసిందని తెలిపింది. అప్పటి నుంచి నాలుగేళ్ల మనవడు, ఏడాదిన్నర వయసున్న మనవరాలిని తానే పెంచి పోషిస్తున్నాని చెప్పింది. పిల్లల భవిష్యత్తుకు సాయం చేయాలని విన్నవించింది. తన కొడుకు నాడు రాజశేఖరరెడ్డికి, ఇప్పుడు మీకు వీరాభిమానిగా ఉండేవాడని ఫొటో చూపించి కన్నీటి పర్యంతమైంది. రామలక్ష్మమ్మ బాధను విని చలించిపోయిన సీఎం వెంటనే ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలని మంత్రి ఉషశ్రీచరణ్‌, కలెక్టర్‌ గౌతమిలను ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు శుక్రవారం మంత్రి ఉషశ్రీచరణ్‌ రామలక్ష్మమ్మకు రూ.2 లక్షల చెక్కును అందజేశారు. పిల్లల పోషణకు వినియోగించుకోవాలని సూచించారు. తన బాధను విన్న సీఎం వెంటనే ఆదుకోవడంపై రామలక్ష్మమ్మ కృతజ్ఞతలు తెలిపింది. తనకు స్థలమిచ్చి ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరగా.. మంత్రి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఐదుకల్లు సర్పంచు విరుపాక్షి గౌడ్‌, వైఎస్సార్‌సీపీ నాయకురాలు మంజులతో పాటు పలువురు పాల్గొన్నారు.

డెంగీ కలవరం

- జిల్లాలో వంద దాటిన కేసులు
- నీటి నిల్వలతో డెంగీ వచ్చే ప్రమాదం
- అప్రమత్తమైన వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: జిల్లాలో డెంగీ కేసులు కలవరపెడుతున్నాయి. మలేరియా కేసులు తగ్గిపోయి ఊపిరి పీల్చుకుంటున్న సమయంలో అత్యంత ప్రమాదకరమైన డెంగీ జ్వరాల నమోదు రోజురోజుకూ పెరుగుతోంది. మరీ ముఖ్యంగా అర్బన్‌ ప్రాంతాల్లో డెంగీ కేసులు విజృంభిస్తున్నాయి. శుక్రవారం నాటికి 102 డెంగీ కేసులు నమోదయ్యాయి. ఇందులో 50 కేసులు అనంతపురం అర్బన్‌లోనే ఉన్నాయి. మిగిలినవి రాయదుర్గం, తాడిపత్రి, గుంతకల్లు మున్సిపాలిటీలతో పాటు గ్రామాల్లోనూ నమోదయ్యాయి. దీంతో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంల ద్వారా ఇంటింటి సర్వే చేపట్టి ఫీవర్‌ కేసులను గుర్తిస్తున్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందేలా చూస్తున్నారు. నీటి నిల్వలు, అక్కడక్కడా పారిశుధ్య లోపం వల్ల జ్వరాలు వస్తున్నట్లు గుర్తించారు.

ప్రైవేటు ఆస్పత్రుల నిలువు దోపిడీ

సాధారణ జ్వరాలను సైతం డెంగీ పేరుతో ప్రైవేటు ఆస్పత్రులు దోపిడీ చేస్తున్నాయి. సాధారణంగా ఏ జ్వరం వచ్చినా ప్లేట్‌లెట్స్‌ తగ్గడం సాధారణం. కానీ ప్లేట్‌లెట్స్‌ పడిపోయాయి అన్న సాకుతో రూ.వేలకు వేలు వసూలు చేస్తున్నాయి. డెంగీ నోటిఫైడ్‌ డిసీజ్‌. అంటే ఇది నిర్ధారణ అయింది అంటే ప్రభుత్వానికి సమాచారం తెలియజేయాలి. నమూనాలు పంపించాలి. ఇవేమీ లేకుండా డెంగీ పేరుతో రూ.30 వేల నుంచి రూ.40వేల దాకా వసూలు చేస్తున్నాయి. వర్షాలు మొదలవకనే ఇలా ఉంటే.. వర్షాలు పడితే డెంగీ కేసులు మరిన్ని పెరిగే అవకాశం ఉందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి.

డెంగీ లక్షణాలు

- డెంగీ జ్వరం ఏడిస్‌ ఈజిప్ట్‌ దోమ కుట్టడం వల్ల వస్తుంది.
- దోమ కుట్టిన 24 గంటల్లోనే విపరీతమైన తలనొప్పి వస్తుంది.
- జ్వర తీవ్రత పెరిగేకొద్దీ కళ్లు ఎర్రగా మారుతుంటాయి.
- మరుసటి రోజు కండరాల నొప్పి తీవ్రమవుతుంది.
- కీళ్ల నొప్పులు అంటే ప్రతి కీలు వద్దా నొప్పి తీవ్రంగా ఉంటుంది.
- ఒళ్లంతా దద్దుర్లలా మొదలై, అవి ఎర్రగా మారుతుంటాయి.
- ఆహారం తీసుకోవాలనిపించదు, తీసుకున్నా వాంతులవుతాయి.
- డెంగీ హీమరోజిక్‌ ఫీవర్‌ (డీహెచ్‌ఎఫ్‌) అంటే ఎక్కువ తీవ్రత ఉన్నట్టు.
- ఇక చివరి దశ అంటే డెంగీ షాక్‌ సింద్రోమ్‌ (డీఎస్‌ఎస్‌) అంటారు.

ఈ ఏడాదిలో ఇప్పటివరకు నమోదైన దోమకాటు జ్వరాలు

నమూనాలు పరీక్షించింది	5,264
డెంగీ పాజిటివ్‌ కేసులు	102
మలేరియా నమూనాలు	1,34,330
పాజిటివ్‌ కేసులు	4
2022లో డెంగీ కేసులు	227
2022లో మలేరియా	11

చికిత్సకు మార్గదర్శకాలు

- డెంగీ వచ్చిందని నిర్ధారించగానే రోగిని ప్రత్యేక వార్డులో ఉంచాలి.
- ఫిజీషియన్‌ సూచనల మేరకు మాత్రమే యాంటీబయాటిక్స్‌ ఇవ్వాలి.
- ప్రస్తుత పరిస్థితుల్లో యాంటీవైరల్‌ ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయి. అవి ఇవ్వొచ్చు.
- ముందుగా జ్వర తీవ్రతను తగ్గించేందుకు తరచూ పారాసిటమాల్‌ ఇవ్వాలి.
- రోగికి నాలుగైదు రోజుల పాటు పండ్లు, పండ్ల రసాలు మాత్రమే ఆహారంగా ఇవ్వాలి.
- రోగి పరిస్థితిని బట్టి ఐవీ ఫ్లూయిడ్స్‌ ఎక్కించాలి.
- రోగికి వీలైనంత ఎక్కువ మోతాదులో నీళ్లు తాగించాలి.
- ఇంటిచుట్టూ కొబ్బరి చిప్పలు, టైర్లు, పాత బాటిళ్లలో నీళ్లు నిల్వలేకుండా చూడాలి.

నీళ్లు నిల్వ ఉండటం వల్లే..

డెంగీ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి గ్రామంలోనూ తమ ఇళ్లచుట్టూ నీళ్లు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచిస్తున్నాం. వలంటీర్లు, ఆశా కార్యకర్తల ద్వారా కరపత్రాలు పంపిణీ చేస్తున్నాం. పట్టణాల్లో అక్కడక్కడా పారిశుధ్యం సరిగా లేకపోవడం వల్ల కూడా కేసులు ఎక్కువగా వస్తున్నాయి.

–ఓబులు, జిల్లా మలేరియా అధికారి

కొండగుట్టల్లో సీడ్ బాల్స్



- మొక్కలకు బదులుగా విత్తన నాట్లు
- ఇతర రాష్ట్రాల్లో సానుకూల ఫలితాలు
- సీడ్‌బాల్స్ తయారు చేయిస్తున్న అధికారులు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వెయ్యి హెక్టార్లలో అమలుకు సన్నద్ధం

పర్యావరణ పరిరక్షణలో కీలకమైన పచ్చని చెట్లను పెంచడానికి వీలైనన్ని వనరులను అధికార యంత్రాంగం సమీకరిస్తోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని కొండలు, గుట్టలు, ఖాళీ స్థలాల్లో విసిరేందుకు విత్తన బంతులను తయారు చేయిస్తోంది.



సీడ్‌బాల్స్‌ను తయారు చేస్తున్న కూలీలు

అనంతపురం టౌన్: కొండ గుట్టలను పచ్చని మొక్కలతో నింపేందుకు ప్రతి ఏటా జిల్లాలోని కొండ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని అటవీశాఖతో పాటు జిల్లా నీటి యాజమాన్య సంస్థ చేపట్టేది. ఉపాధి హామీ నిధులతో నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కల పెంపకాన్ని చేపట్టేవారు. అయితే వీటి ద్వారా సానుకూల ప్రయోజనాలు అంతంతగానే ఉండేవి. కొండల్లో నాటిన మొక్కల్లో ఎక్కువ శాతం చనిపోవడంతో అనుకున్న లక్ష్యం ప్రతి ఏటా నీరుగారిపోయేది. అయితే పలు ప్రాంతాల్లో సీడ్‌బాల్స్‌తో కొండ ప్రాంతాల్లో మొక్కలను నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. సీడ్ బాల్స్‌తో 60-70 శాతం మేర ప్రయోజనం ఉండడంతో ఈ విధానాన్ని ఇక్కడా అమలు చేసేందుకు సిద్ధమయ్యారు.

సీడ్ బాల్స్ తయారీ ఇలా...

ఎర్రమట్టి, నల్లమట్టితో పాటు సేంద్రియ ఎరువులను సమపాలల్లో కలిపి విత్తనాలను వాటిలో పెట్టి చిన్న చిన్న బాల్స్‌లాగా తయారు చేస్తారు. ఇలా తయారు చేసిన సీడ్‌బాల్స్‌ను కొండ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కందకాల్లో ఉంచుతారు. వర్షం రాగానే సీడ్‌బాల్స్‌లోని విత్తనాలు మొలకెత్తి బయటకు వస్తాయి. అప్పటికే బాల్స్‌లో ఏర్పాటు చేసిన సారవంతమైన మట్టితో పాటు సేంద్రియ ఎరువులు సమపాలల్లో ఉండడంతో అవి వర్షకాలం పూర్తయ్యేలోగా ఏపుగా పెరిగేందుకు అవకాశం ఉండడంతో పాటు మొక్కలు చనిపోయేందుకు ఆస్కారం తక్కువగా ఉంటుంది.

మండలానికి 2 కొండల్లో ...

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఉన్న 63 మండలాల్లోని వివిధ ప్రాంతాల్లో ఉన్న కొండ గుట్టల్లో సీడ్ బాల్స్‌ను వేసేందుకు జిల్లా నీటియాజమాన్య సంస్థ అధికారులు ప్రణాళికలను రూపొందిస్తున్నారు. ప్రతి మండలంలో రెండు కొండ గుట్టల్లో ఈ ప్రక్రియ చేపట్టేందుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే ఆయా కొండల్లో వేసవి కాలంలో ఉపాధి కూలీల ద్వారా కందకాలను తవ్వించారు. తవ్విన కందకాల్లోనే సీడ్‌బాల్స్ వేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 1000 కొండ గుట్టల్లో దాదాపు వెయ్యి హెక్టార్లలో ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు.

నెలాఖరులోగా సీడ్‌బాల్స్



ఉపాధి హామీ నిధులతో ఇప్పటికే 10 లక్షల విత్తన నాట్ల కోసం సీడ్‌బాల్స్ తయారు చేస్తున్నాం. ఒక్కో సీడ్‌బాల్‌లో రెండు నుంచి మూడు విత్తనాలను ఉంచి బాల్స్‌ను తయారు చేశాం. కొండ ప్రాంతాల్లో వాటిని నాటేందుకు ఇప్పటికే అన్ని రకాల చర్యలను పూర్తి చేశాం. గత వేసవిలో కొండ ప్రాంతాల్లో కందకాలు తవ్వే కార్యక్రమాన్ని పూర్తి చేశాం. వర్షం రాగానే ఈనెలాఖరులోగా సీడ్ బాల్స్ వేస్తాము.

– వేణుగోపాల్‌రెడ్డి, డ్వామా పీడీ

ఖర్చు తక్కువ... ప్రయోజనాలు ఎక్కువ

కొండ గుట్టల్లో మొక్కలను నాటేందుకు గతంలో అధిక ఖర్చు చేయాల్సి వచ్చేది. నర్సరీల్లో విత్తనాలను పెట్టి మొక్కలను రెండు నెలల పాటు సంరక్షించాల్సి ఉండేది. ఇందు కోసం ప్రతి ఏటా రూ.కోట్ల నిధులు ఖర్చు అయ్యేవి. ఒక మొక్క కొనుగోలు చేసి నాటేందుకు దాదాపు రూ.100కు పైగా ఖర్చు పెట్టేవారు. ప్రస్తుతం సీడ్‌బాల్స్ విధానంలో ఖర్చు సైతం తక్కువగానే అవుతోందని అధికారులు చెబుతున్నారు. ఒక సీడ్ బాల్ తయారు చేసేందుకు 90 పైసలు మాత్రమే ఖర్చు అవుతోంది. వీటి ద్వారా ఫలితాలు సైతం అనుకున్న దాని కంటే ఎక్కువగా ఉండడంతో ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. సీడ్‌బాల్స్‌లో వేప, చింత, సీతాఫలం, రేగు, కుంకుడు, కానుగ విత్తనాలను పెట్టి విత్తన నాట్లు వేయనున్నారు.

● చేతికందనిబోరు



ఎన్నడూ లేని విధంగా గడిచిన నాలుగేళ్లలో రికార్డు స్థాయిలో వర్షాలు, వరదలు రావడంతో పామిడి పెన్నానది నిండుగా ప్రవహించింది. గత ఏడాది అయితే పెన్నానది పూర్తిస్థాయిలో రోజుల తరబడి ఉధృతంగా పారింది. ఇసుకతో పాటు మట్టి కూడా కోతకు గురైంది. అలా ఓ చేతిబోరు కింద పది అడుగుల మేర మట్టి కొట్టుకుపోయింది. చేతిబోరు ఇప్పుడు అక్కడ అందనంత ఎత్తులో ఇలా కనిపిస్తోంది.

– జి.వీరేష్, సాక్షి ఫొటో గ్రాఫర్

క్లుప్తంగా

కేజీబీవీ టీచర్ల ఎంపిక జాబితా విడుదల

- నేడు సైన్స్‌సెంటర్‌లో నియామక కౌన్సెలింగ్

రాప్తాడురూరల్: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాల్లో (కేజీబీవీ) ఖాళీగా ఉన్న 279 పోస్టులకు (ప్రిన్సిపాల్, సీఆర్టీ, పీజీటీ, పీఈటీ) సంబంధించి ఎంపిక జాబితాను శుక్రవారం విడుదల చేశారు. అకడమిక్ మెరిట్, స్కిల్ టెస్ట్ మెరిట్, రోస్టర్ ప్రకారం 277 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసినట్లు సమగ్ర శిక్ష ఏపీసీ, డీఈఓ సాయిరామ్ ఓ ప్రకటనలో తెలిపారు. పీజీటీ ఎంపీహెచ్‌డబ్ల్యూలో క్వాలిఫైడ్ అభ్యర్థులు లేక ఒక పోస్టు, పీజీటీ ఇంగ్లిష్ సబ్జెక్టు, స్పోర్ట్స్ కోటాలో ఒక పోస్టు పెండింగ్ పెట్టినట్లు పేర్కొన్నారు. ఎంపికైన 277 మంది అభ్యర్థులకు ఫోన్‌కాల్, వాట్సాప్ మెసేజ్ ద్వారా సమాచారం పంపామన్నారు. ఎంపికైనా వారికి శనివారం ఉదయం 9 గంటలకు అనంతపురంలోని సైన్స్ సెంటర్‌లో కౌన్సెలింగ్ నిర్వహించి నియామక ఉత్తర్వులు అందచేస్తామని వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థుల వివరాలు https://samagrashikshaatp.blogspot. com అనే వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు.

జేఎన్‌టీయూ (ఏ)లో పదోన్నతులు

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురంలో శుక్రవారం కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం (సీఏఎస్) కింద పదోన్నతులు కల్పించారు. జేఎన్‌టీయూ అనంతపురం వీసీ జింకా రంగజనార్దన ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ సి.శశిధర్ ఉత్తర్వులు అందజేశారు. పదోన్నతులు పొందిన వారికి వీసీ జింకా రంగజనార్దన, రిజిస్ట్రార్ సి.శశిధర్ అభినందనలు తెలిపారు.



జేఎన్‌టీయూ అనంతపురం వీసీ జింకా రంగజనార్దనతో పదోన్నతులు దక్కిన ప్రొఫెసర్లు

పేరు	ప్రస్తుత స్థానం	పదోన్నతి పొందిన స్థానం
కే.మాధవి	అసోసియేట్	ప్రొఫెసర్
ఎస్.చంద్రమోహన్‌రెడ్డి	అసోసియేట్	ప్రొఫెసర్
డి. విష్ణువర్ధన్	అసోసియేట్	ప్రొఫెసర్
ఏపీ.శివకుమార్	అసోసియేట్	ప్రొఫెసర్
బి. దిలీప్‌కుమార్	అసోసియేట్	ప్రొఫెసర్
కే. శేషమహేశ్వరమ్మ	అసోసియేట్	ప్రొఫెసర్
కే. జితేంద్రగౌడ్	అసిస్టెంట్	అసోసియేట్ ప్రొఫెసర్
ఎస్. అరుణ మస్తాని	అసిస్టెంట్	అసోసియేట్
కే.కళ్యాణిరాధ	అసిస్టెంట్	అసోసియేట్
ఎన్ సరిత	అసిస్టెంట్	అసోసియేట్
ఏ. శైలాకుమారి	అసిస్టెంట్	అసోసియేట్
ఆర్ మంజుల	అసిస్టెంట్	అసోసియేట్
ఎం. సాంబయ్య	అసిస్టెంట్	అసోసియేట్

ఇళ్ల నిర్మాణాల్లో ఆర్డీటీ భాగస్వామ్యం భేష్

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: 'ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేద ప్రజలకు సొంతింటి కల సాకారం చేస్తోంది. కురుగుంటలో ప్రభుత్వం నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాల్లో ఆర్డీటీ భాగస్వామ్యం మరువలేము' అని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. కురుగుంట లే అవుట్‌లో 630 ఇళ్ల నిర్మాణాల భూమి పూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛోఫెర్రర్, మేయర్ వసీం పాల్గొన్నారు. ఎమ్మెల్యే అనంత మాట్లాడుతూ అనంతపురం నియోజకవర్గంలో 23 వేల మందికి ప్రభుత్వం ఇళ్ల స్థలాలను కేటాయించిందన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షలు (ఒక లక్షా 80 వేలు), మహిళా సంఘాల నుంచి రూ.35 వేలు అందించేలా చర్యలు తీసుకుందన్నారు. దీనికితోడు ఆర్డీటీ ప్రతి ఇంటి నిర్మాణానికి రూ.25 వేలు వెచ్చిస్తోందన్నారు. ఇళ్ల నిర్మాణాలను ప్రభుత్వమే చేపట్టాలన్న లబ్ధిదారుల విజ్ఞప్తి మేరకు ఆర్డీటీ సహకారంతో నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. కలెక్టర్ గౌతమి ప్రత్యేక చొరవ తీసుకుని ఆర్డీటీతో మాట్లాడడం, అందుకు ఆర్డీటీ ముందుకురావడం హర్షణీయమన్నారు. జిల్లాలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆర్డీటీ చేపట్టిన కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. మేయర్ వసీం మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాల్లో ఆర్డీటీ భాగస్వామ్యం తోడవడం శుభపరిణామమన్నారు. ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛోఫెర్రర్ మాట్లాడుతూ 15 ఏళ్ల క్రితం కురుగుంటలో ఇళ్ల నిర్మాణాలు చేశామని గుర్తు చేశారు. పెద్ద బాధ్యత తమపై ఉంచారని, వీలైనంత త్వరగా నిర్మాణాలు పూర్తి చేస్తామన్నారు. పేద ప్రజలకు సేవ చేయడానికి ఆర్డీటీ ఎప్పుడూ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, మాజీ మేయర్ రాగే పరుశురాం, హౌసింగ్ పీడీ కేశవనాయుడు, కార్పొరేటర్లు శేఖర్‌బాబు, సైపుల్లాబేగ్, సంపంగి రామాంజినేయులు, సుజాత, తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, చిత్రంలో ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛోఫెర్రర్

జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య

రాప్తాడురూరల్: జిల్లాలో జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు విద్యాసంస్థల్లో ఉచిత విద్యను అమలు చేసేలా కలెక్టర్ గౌతమి ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వుల ప్రతిని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్ శుక్రవారం ఏపీయూడబ్ల్యూజే జిల్లా కన్వీనర్ పయ్యావుల ప్రవీణ్, చౌడప్పకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగేళ్లుగా కరోనా, ఇతర కారణాలతో జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య ఆగిపోయిందన్నారు. కలెక్టర్ గౌతమి, విద్యాశాఖ అధికారి సాయిరామ్‌ను కలిసి జర్నలిస్టుల పరిస్థితిని వివరించి ఉచిత విద్య అందే విధంగా చూడాలని కోరామన్నారు. ఈ క్రమంలో 2023- 24 సంవత్సరానికి జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యను అందించే విధంగా ఉత్తర్వులు ఇచ్చారన్నారు. కలెక్టర్, డీఈఓకు కృతజ్ఞతలు తెలియజేశారు.

యువకుడి ఆత్మహత్య

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగరంలోని రంగస్వామినగర్‌లో నివాసం ఉంటున్న మోహన్‌బాబు (24) అనే యువకుడు శుక్రవారం ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. త్రీటౌన్ సీఐ ధరణీకిశోర్ వివరాల మేరకు... మోహన్‌బాబు తల్లి 20 ఏళ్ల క్రితం చనిపోయింది. దీంతో మృతుడు మోహన్‌బాబు అవ్వ వద్దే ఉంటున్నాడు. అయితే ఎవరితో మాట్లాడటానికి మోహన్‌బాబు పెద్దగా ఆసక్తి చూపేవాడు కాదు. అయితే ఏం జరిగిందో తెలియదు గాని ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి అవ్వ ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు సీఐ ధరణీకిశోర్ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బుక్కరాయసముద్రం నుంచి అనంతపురం నగరానికి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను శుక్రవారం త్రీటౌన్ పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు ట్రాక్టరును సీజ్ చేసినట్లు సీఐ ధరణీ కిశోర్ తెలిపారు. బోయకొట్టాలకు చెందిన వ్యక్తులు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు.

హత్యాయత్నం కేసులో వ్యక్తి అరెస్ట్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఆస్తి కోసం అన్న కుమారుడిని కడతేర్చాలని చూసిన నిందితుడిని నాల్గవ పట్టణ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. సీఐ ప్రతాప్‌రెడ్డి తెలిపిన వివరాలమేరకు... నాలుగు రోజుల క్రితం స్థానిక రామ్‌నగర్ రైల్వేగేటు సమీపంలోని మద్యం దుకాణం వద్ద నాయుడు అనే వ్యక్తిని అతని చిన్నాన్న చంద్రశేఖరనాయుడు మాటల్లో పెట్టి పిడిబాకుతో దాడి చేశాడు. తర్వాత చంద్రశేఖరనాయుడు పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టామన్నారు. స్థానిక రుద్రంపేట కూడలిలో చంద్రశేఖరనాయుడు ఉన్నట్లు సమాచారం రావడంతో అతన్ని పట్టుకున్నామన్నారు. నాయుడు ప్రస్తుతం ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని, పరిస్థితి అదుపులోనే ఉందన్నారు.

చెలరేగిన అనంతపురం జట్టు



గిరినాథరెడ్డి



డీబీ ప్రశాంత్‌కుమార్

అనంతపురం: అంతర జిల్లా సీనియర్ మల్టీ డే మ్యాచ్‌లో భాగంగా శుక్రవారం జరిగిన అనంతపురం, కర్నూలు జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. అనంతపురం జట్టు 133 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 697 భారీ పరుగులు సాధించింది. డీబీ ప్రశాంత్‌కుమార్ 156 పరుగులు (20 ఫోర్లు, 3 సిక్సర్లు), పి. గిరినాథరెడ్డి 152 పరుగులు (13 ఫోర్లు, 7 సిక్సర్లు), బి.యోగానంద 128 పరుగులు (20 ఫోర్లు) , జి. సంపత్ కుమార్ 86 (8 ఫోర్లు, మూడు సిక్సర్లు) పరుగులతో సమిష్టిగా రాణించారు. కర్నూలు జట్టు నాలుగు వికెట్ల నష్టానికి 157 పరుగులు చేసింది. అనంతపురం జట్టు 540 పరుగుల ఆధిక్యంలో ఉంది.

ఇంటిగ్రేటెడ్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం, బ్లెకింగ్ వర్సిటీ (స్వీడన్) సంయుక్తంగా ఇంటిగ్రేటెడ్ కోర్సులను అమలు చేస్తున్నాయి. ఇందులో అడ్మిషన్లు పొందడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తూ శుక్రవారం నోటిఫికేషన్ జారీ అయింది. ఇంటిగ్రేటెడ్ కోర్సు ద్వారా బీటెక్ బ్రాంచ్‌లో తొలి మూడు సంవత్సరాలు , ఒక సంవత్సరం బీటీహెచ్ స్వీడన్‌లో బీఎస్ కోర్సు చేయాల్సి ఉంటుంది. అనంతరం రెండు సంవత్సరాల ఎంఎస్ కోర్సును స్వీడన్‌లో అభ్యసించవచ్చు.

- బీటెక్ కోర్సు మూడు సంవత్సరాలు జేఎన్‌టీయూ అనంతపురం క్యాంపస్‌లోనూ, ఒక సంవత్సరం విద్యను బీటీహెచ్ స్వీడన్‌లో పూర్తిచేయాల్సి ఉంటుంది. డిగ్రీని జేఎన్‌టీయూ అనంతపురం ప్రదానం చేస్తుంది. బీఎస్ పట్టాను బ్లెకింగ్ వర్సిటీ (బీటీహెచ్) స్వీడన్ ప్రదానం చేస్తుంది.
- ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం ఇన్ కంప్యూటర్ సైన్స్ (10 ఖాళీలు) ఇందులో విద్యార్థి బీటెక్ కంప్యూటర్ సైన్స్‌లో 3 సంవత్సరాలు . స్వీడన్‌లో ఒక సంవత్సరం చదువుతారు.
- ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో 10 ఖాళీలు.
- ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం ఇన్ మెషిన్ లెర్నింగ్‌లో 10 ఖాళీలు ఉండగా, జేఎన్‌టీయూ అనంతపురంలోని ఈసీఈ విభాగంలో మూడు సంవత్సరాలు, చివరి సంవత్సరం బ్లెకింగ్ వర్సిటీలో చదువుతారు.



జేఎన్‌టీయూ అనంతపురం క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాల

విద్యార్హతలు

ఇంటర్మీడియట్ ఎంపీసీ కోర్సును పూర్తి చేసిన వారు అర్హులు. కనీసం 70 శాతం మార్కులు పొందాలి. జేఈఈ మెయిన్స్ –2023, ఏపీ ఈఏపీసెట్ –2023, టీఎస్‌ఈఏపీసెట్ –2023 ర్యాంకు ఆధారంగా అడ్మిషన్లు కల్పిస్తారు. బీటీహెచ్, స్వీడన్ మెరిట్ ఆధారిత ఉపకారవేతనాలు అందిస్తారు. పూర్తి వివరాలను జేఎన్‌టీయూ అనంతపురం ఫారిన్ ఎఫైర్స్ డైరెక్టర్ లేదా డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్‌లో తెలుసుకోవచ్చు.

అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

- ఎంపీ తలారి రంగయ్య

అనంతపురం క్రైం: సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో జనరిక్ మందుల షాపు, సెక్యూరిటీ, పార్కింగ్, రోగి సహాయకులకు షెడ్లు, క్యాంటీన్ ఏర్పాటు, తదితర అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎంపీ తలారి రంగయ్య ఏపీఎంఎస్ఐడీసీ అధికారులకు సూచించారు. శుక్రవారం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఎంపీ తలారి రంగయ్య పరిశీలించారు. అభివృద్ధి పనులకు సంబంధించి ఆస్పత్రి ఆవరణంలో అనువైన ప్రాంతాలను ఎంపీ పరిశీలించి, అధికారులతో మాట్లాడారు. అనంతరం సూపర్ స్పెషాలిటీ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ సౌజన్యకుమార్‌తో ఓపీ, ఐపీ, శస్త్రచికిత్సలపై ఆరా తీశారు. సేవలు మెరుగుపడ్డాయని, ఇదే స్ఫూర్తితో ఉత్తమ సేవలందించాలన్నారు.



సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో పర్యటిస్తున్న ఎంపీ తలారి రంగయ్య

ఆర్‌ఓబీకి పూలే పేరు పెట్టాలి : నగరంలో నూతనంగా ఏర్పాటైన రైల్వే ఓవర్ బ్రిడ్జ్ (ఆర్‌ఓబీ)కి మహాత్మా జ్యోతిరావ్ పూలే పేరు పెట్టాలని ఎంపీ రంగయ్య మేయర్ వసీంకు వినతిపత్రం అందించారు. శుక్రవారం నగరపాలక సంస్థలో మేయర్ చాంబర్‌కు ఎంపీ వెళ్లారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, న్యాయవాది సాకే నరేష్, బీసీ సంక్షేమ సంఘం ముఖ్యనేతలు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విదేశీ విద్యార్థులకు ఆహ్వానం

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురంలో విదేశీ విద్యార్థులకు బీటెక్, ఎంటెక్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వీసీ జింకా రంగజనార్దన తెలిపారు. బీటెక్ (సివిల్, ఈఈఈ, మెకానికల్, ఈసీఈ, సీఎస్ఈ, కెమికల్, ఫుడ్ టెక్నాలజీ) , ఎంటెక్ (స్ట్రక్చరల్, బ్రిడ్జెస్ అండ్ టన్నెల్స్, ఎలక్ట్రికల్ పవర్ సిస్టమ్స్, పవర్ అండ్ ఇండస్ట్రియల్ డ్రైవ్స్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండీషన్, అడ్వాన్స్‌డ్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్, డిజిటల్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ సిస్టమ్స్, వీఎల్ఎస్ఐ డిజైన్, కంప్యూటర్ సైన్సెస్, నానో టెక్నాలజీ) , ఎంసీఏ, ఎంబీఏ, కోర్సుల్లో విదేశీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సార్క్ దేశాల విద్యార్థులకు 30 శాతం కోర్సు ఫీజులో రాయితీ, 40 శాతం డెవలప్‌మెంట్ ఫీజు రాయితీ లభిస్తుంది. పూర్తి వివరాలకు జేఎన్‌టీయూ అనంతపురం వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చని సూచించారు.

వసతి గృహాలకు చిక్కీలు

అనంతపురం రూరల్: బీసీ సంక్షేమశాఖ వసతి గృహాలకు రెండు నెలలకు సరిపడా చిక్కీలు వచ్చాయని బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూ కొఠారి తెలిపారు. ప్రభుత్వం విద్యార్థులకు మెనూలో రుచికరమైన భోజనంతో పాటు చిక్కీలు అందిస్తోందన్నారు. జిల్లాలోని అన్ని బీసీ సంక్షేమశాఖ వసతి గృహాలకు రెండు నెలలకు సరిపడా చిక్కీలను అందిస్తున్నామన్నారు.

18న మినీ ఉద్యోగ మేళా

అనంతపురం: ఏపీ స్కిల్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కార్యాలయం, అనంతపురంలో 18న నిరుద్యోగులకు మినీ ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎల్. ఆనంద్ రాజ్‌కుమార్ తెలిపారు. అనంతపురంలోని జెరీకార్ట్ కంపెనీలో బీపీఓ, పెనుకొండ కియా కంపెనీలో న్యాప్స్ ట్రైనీ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. వివరాలకు 8317520929 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

బాగా చదివి ఉన్నత స్థాయికి చేరాలి

- జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు



పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులతో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: అనంతపురం పోలీస్ లైబ్రరీ కమ్ కాంపిటేటివ్ ఎగ్జామ్స్ స్టడీ సెంటర్‌ను జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు శుక్రవారం సందర్శించారు. ఈనెల 10 నుంచి పోలీస్ లైబ్రరీ కమ్ కాంపిటేటివ్ ఎగ్జామ్స్ స్టడీ సెంటర్‌లో జిల్లా ఎస్పీ చొరవ, ఇన్సైట్ వారి సౌజన్యంతో ప్రారంభమైన యూపీఎస్సీ థర్డ్ బ్యాచ్ ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ తరగతులను పరిశీలించారు. లైబ్రరీలో కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌కు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులతో మాట్లాడి, అందుబాటులో ఉన్న స్టడీ మెటీరియల్, కంప్యూటర్లు, ఇతర సౌకర్యాలపై వారి అభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్నారు. బాగా ప్రిపేర్ అయ్యి మంచి ఉద్యోగాలు సంపాదించాలని ఎస్పీ సూచించారు.

ఉత్తమ పనితీరుతోనే సంస్థ అభివృద్ధి

అనంతపురం సెంట్రల్: ఉత్తమ పనితీరుతో ఆర్టీసీ అభివృద్ధి సాధ్యమని డిపో మేనేజర్ నాగభూపాల్ అన్నారు. శుక్రవారం అనంతపురం డిపో గ్యారేజీలో జూన్ నెలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, సూపర్‌వైజర్లను ఆదర్శ ఉద్యోగులుగా గుర్తిస్తూ సన్మానించారు. డిపో మేనేజర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు వస్తుందని, సంస్థ అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం ఉత్తమ పనితీరు కనబరిచిన డ్రైవర్లు ఎస్ఎస్ కుమార్, బీఎస్ వాసులు, కె. దస్తగిరి, కండక్టర్లు రమాకాంత్, నాగమల్లు, కేసీనాయుడు, రమాకాంత్, రామకృష్ణ, నారాయణ, ఏడీసీ పెద్దన్న, మెకానిక్ బాషా, డిప్యూటీ మెకానిక్ వీరభద్రయ్యను సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ నారాయణ స్వామి, అసిస్టెంట్ మేనేజర్ వినయ్‌కుమార్, ట్రాఫిక్ సూపరింటెండెంట్ ఆంజనేయులు, యూనియన్ లీడర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్లోకి సెల్టాస్ ఫేస్‌లిఫ్ట్ కారు విడుదల



సెల్టాస్ కారును మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న షోరూం ప్రతినిధులు

అనంతపురం సెంట్రల్: నగర శివారులోని ఎంజీ బ్రదర్స్ కియా షోరూంలో సెల్టాస్ ఫేస్‌లిఫ్ట్ మోడల్ కారును మార్కెట్‌లోకి శుక్రవారం విడుదల చేశారు. షోరూం హెడ్ ఎల్లప్ప, జనరల్ మేనేజర్ గిరిప్రసాద్, సేల్స్ మేనేజర్ నేమతుల్లా తదితరులు పాల్గొన్నారు. మొత్తం 9 రంగులు, 7 వేరియంట్లలో కారు లభిస్తుందని వివరించారు.


దివ్యాంగుడికి ట్రై సైకిల్ మంజూరు



వడ్డే మారప్పకు ట్రై సైకిల్ అందిస్తున్న ఎమ్మెల్యే అనంత

అనంతపురం క్రైం: రుద్రంపేట పంచాయతీ అజేయ్‌ఘోష్ కాలనీకి చెందిన వడ్డే మారెప్పకు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి 24 గంటల్లో ట్రై సైకిల్‌ను అందించారు. ఇటీవల వడ్డే మారెప్ప తనకు ట్రై సైకిల్ ఇప్పించాలని ఎమ్మెల్యేను విన్నవించాడు. శుక్రవారం ఎమ్మెల్యే నివాసంలో ట్రై సైకిల్ అందజేశారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ లక్ష్మన్న, నాయకులు ఆది నాయక్, తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ పర్యటన ఏర్పాట్ల పరిశీలన



వీసీతో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ హనుమంతు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం 21వ స్నాతకోత్సవం ఈనెల 17న నిర్వహించనున్నారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో అనంతపురం అడిషనల్ ఎస్పీ హనుమంతు, ఇటుకులపల్లి సీఐ నరేందర్ రెడ్డి ఏర్పాట్లు పరిశీలించారు. ఎస్కేయూ వీసీ రామకృష్ణారెడ్డి తో సమావేశమయ్యారు.

ఆర్అండ్‌బీ అతిథి గృహం ముస్తాబు

అనంతపురం టవర్‌క్లాక్: రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఈ నెల 17న జిల్లాకు రానున్నారు. గవర్నర్ విడిది కోసం ఆర్అండ్‌బీ అతిథి గృహాన్ని ముస్తాబు చేస్తున్నారు. అధికారులు దాదాపు రూ.25 లక్షలు వెచ్చించి, అతిథిగృహాన్ని సుందరంగా మారుస్తున్నారు.

ప్రాణాలు ఎదురొడ్డి ప్రజాసేవ



వరద బాధితులకు సేవలందించిన వలంటీరు నవీన్‌కుమార్‌ను సన్మానిస్తున్న అప్పటి డీఎస్పీ శ్రీనివాసులు (ఫైల్)

వలంటీర్లకు వందనం

రాప్తాడురూరల్: వలంటీర్లు ప్రజలకు సేవ చేసేందుకు ప్రభుత్వం కల్పించిన పెద్ద అవకాశంగా భావిస్తున్నారు. పథకాల అమలులోనే కాకుండా కరోనా కష్టకాలంలోనూ ప్రాణాలు సైతం పణంగా పెట్టి ఇంటింటా సేవలందించారు. విపత్తుల సమయంలోనూ వరదబాధితులను ఆదుకోవడంలోనూ ముందున్నారు. గతేడాది అక్టోబర్ 11న అర్ధరాత్రి వేళ జోరువాన కురిసింది. అందరూ నిద్రిస్తుండగా ఒక్కసారిగా అలజడి మొదలైంది. ఇళ్లలోకి వర్షం నీరు చేరుతోంది. జనం నిద్రమత్తు వీడి ప్రాణభయంతో వణికిపోయారు. అనంతపురం రూరల్ మండలం సుందరయ్యకాలనీ, జాకీర్‌కొట్టాలు, దండోరాకాలనీ, ఆదర్శనగర్, జీఎం కాలనీల్లో వందలాది ఇళ్లలోకి వర్షం నీరు రావడంతో ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ గడిపారు. అప్పటి కలెక్టర్ నాగలక్ష్మి, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అధికారులను అప్రమత్తం చేశారు. 12న తెల్లవారుజామున నుంచే పోలీసు, రెవెన్యూ అధికారులతో పాటు సచివాయాల ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు సహాయక చర్యలు చేపట్టారు. రెస్క్యూ బృందాలు ఇళ్లలో, ఇళ్లపైన ఉన్న వారిని అతికష్టం మీద సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ సమయంలో ఆయా కాలనీల వలంటీర్లు ఎలీష్, చంద్రకళ, నవీన్‌కుమార్, జమీల, వెంకటేష్‌నాయక్, అఖిల్, సంతోష్, శ్రావణి, అశోక్‌నాయక్, కవిత తదితరులు సాహసోపేతంగా సేవలందించారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రతి ఇంటికీ 25 కేజీల బియ్యం, రూ. 3 వేలు సాయం వలంటీర్ల ద్వారా అందించారు.

సేవలోనే ఆనందం



రాప్తాడురూరల్: వలంటీర్ వ్యవస్థద్వారా ప్రజలకు నేరుగా సేవ చేసే అవకాశాన్ని మాకు కల్పించింది. ఇందులో జీతం కాదు..సేవల్లో ఆనందం చూస్తున్నాం. ఇంటింటికీ వెళ్లి వారికి అవసరమైన సేవలందిస్తుంటే వారంతా సొంత కుటుంబ సభ్యుడిలా ఆప్యాయంగా చూస్తున్నారు. కరోనాలాంటి విపత్కర సమయంలోనూ, వరద సమయంలో బాధితులకు అందించిన సేవలను జీవితంలో మరిచిపోలేను.

– బి.నవీన్, వలంటీరు, సియేస్‌పురం, కేకే కాలనీ పంచాయతీ

పాడి రైతుల అభ్యున్నతికి ఎమ్మెల్యే కృషి



ఆత్మకూరులో రుణాల దరఖాస్తులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

- 'అమ్మ డెయిరీ'తో మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు
- అర్హులైన ప్రతి ఒక్కరికీ రుణాలు

ఆత్మకూరు: నియోజకవర్గంలో పాడి రైతుల ప్రోత్సాహానికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కృషి చేస్తున్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి సొంత డబ్బు వెచ్చించి పదివేల మంది మహిళలకు ఉపాధి కల్పించేందుకు 'అమ్మ డెయిరీ'ని ఏర్పాటు చేశారు. మరో రెండు రోజుల్లో పాల సేకరణ ప్రారంభం కానుంది. డెయిరీలో ఉన్న ప్రతి పాడి మహిళా రైతుకూ 90 రోజులకోసారి లాభాల్లో వాటా తప్పనిసరిగా అందజేస్తారు. ప్రతి 15 రోజులకోసారి పాల బిల్లులు పాడి రైతులకు అందేలా చర్యలు తీసుకున్నారు.

పాడి రైతుల ప్రోత్సాహానికే రుణాలు: మహిళలు ఆర్థికంగా ఎదగడానికి, పాడి రైతుల ప్రోత్సాహం పెరగాలన్న ఉద్దేశంతో బ్యాంకర్లతో మాట్లాడి రుణాలు ఇప్పించేందుకు ఎమ్మెల్యే చర్యలు చేపట్టారు. ఈ నెల 13న ఆత్మకూరులో మహిళలకు 'రుణమేళా' ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా 6,83 మంది మహిళల నుంచి బ్యాంకర్లు దరఖాస్తులు తీసుకున్నట్లు ఏపీఎం మదన్‌మోహన్ తెలిపారు. రుణమేళాలోభాగంగా అనంతపురం జిల్లా సహకార కేంద్ర బ్యాంక్, కెనరా బ్యాంక్, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు అధికారులు గేదెలు, ఆవులకు రుణాలు ఇచ్చేందుకు ముందుకొచ్చారు.

ఎమ్మెల్యే మేలు మరువలేం



గతంలో ఎంతో మంది ఎమ్మెల్యేలు ఉన్నా ఎవరూ మా గురించి పట్టించుకోలేదు. ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి పాడి పరిశ్రమ అభివృద్ధికి, మహిళల జీవనోపాధి కోసం బ్యాంకర్లతో మాట్లాడి రుణాలు ఇప్పిస్తున్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఏ ఎమ్మెల్యే అండగా నిలబడలేదు .

– అక్కమ్మ, గొరిదిండ్ల

అక్కచెల్లెమ్మల రుణం తీర్చుకుంటా

పాడి పరిశ్రమ ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదగాలి. అమ్మ డెయిరీ ద్వారా డెయిరీలో వచ్చే లాభాలు కూడా సభ్యులకే అందజేస్తాం. పాడి పరిశ్రమ పెరగడానికి మహిళలకు ఆవులకు, గేదెలకు సంబంధించి బ్యాంకర్లతో మాట్లాడి రుణాలు వచ్చేలా ఏర్పాటు చేశాం. దరఖాస్తులు బ్యాంకు వారు తీసుకున్నారు. వాటిని పరిశీలించి రుణాలు అందజేలా చేస్తాం. అర్హతను బట్టి సబ్సిడీ రుణాలు కూడా వచ్చేలా చేస్తామని ఎమ్మెల్యే తెలియజేశారు.

– తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఎమ్మెల్యే

పవన్..చిల్లర రాజకీయాలు మానుకో



పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

అనంతపురం రూరల్: పవన్.. చిల్లర రాజకీయాలు మానుకో, లేకపోతే ప్రజలు నీకు తగిన బుద్ధి చెబుతారని వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు హెచ్చరించారు. వలంటీర్లపై పవన్ కళ్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ శుక్రవారం అనంతపురం రూరల్ మండలం ఏ నారాయణపురం పంచాయతీలో వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు వినూత్న నిరసన తెలియజేశారు. పవన్ కళ్యాణ్ మాస్కు ధరించి భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, వలంటీర్లు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్‌కు మహిళలపై ఏ మాత్రం గౌరవం లేదన్నారు. మహిళలను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమన్నారు. అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తున్న వలంటీర్ వ్యవస్థపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు నాగేంద్ర, హాజీవలి, వైఎస్సార్‌సీపీ నగర మహిళా విభాగం అధ్యక్షురాలు కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్ మోహన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లెల వేణుగోపాల్, మధుసూదన్ రెడ్డి, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ సెస్ బకాయిలు వసూలు చేయాలి



మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమ

అనంతపురం: గ్రంథాలయ సెస్ బకాయిలు వసూలుకు గ్రంథాలయ ఉద్యోగులందరూ సమష్టిగా కృషి చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ ఎం ఉమ అన్నారు. శుక్రవారం ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రంథాలయ ఉద్యోగులతో అనంతపురం కేంద్ర గ్రంథాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ అధ్యక్షత వహించి మాట్లాడారు. గ్రంథాలయాల్లో సభ్యత్వం సంఖ్య పెంపుదల చేయాలన్నారు. సొంత భవనాలు లేని ప్రాంతాల్లో స్థల సేకరణకు సంబంధిత అధికారుల, దాతల సహకారం తీసుకోవాలని కోరారు. గ్రంథాలయ సంస్థ పటిష్టతకు ప్రతి ఉద్యోగీ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి. రమ, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎల్ఎం మోహన్ రెడ్డి, ఉద్యోగ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'జగనన్న సురక్ష'



ఆత్మకూరులో ఇంటింటికీ తిరిగి సర్వే చేస్తున్న ఎంపీపీ సుబ్బర హేమలత

ఆత్మకూరు: గ్రామ వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ప్రతి ఇంటికీ తిరిగి జగనన్న సురక్ష సర్వే చేపట్టాలని ఈవోఆర్డీ దామోదర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని తోపుదుర్తిలో గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లకు సమావేశం నిర్వహించారు. ఈవోఆర్డీ మాట్లాడుతూ శనివారం తోపుదుర్తిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ సాంబశివ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే పథకాలు

ఆత్మకూరు: అక్కా.. ఏమైనా సమస్యలు ఉన్నాయా? ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా? సమస్యలున్నా చెప్పండి.. అంటూ ఎంపీపీ సుబ్బర హేమలత అడిగి తెలుసుకున్నారు. మండల కేంద్రంలోని బీసీ కాలనీలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లతో కలిసి సర్వే నిర్వహించారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని, మహిళల ఆర్థికాభివృద్ధికి అమ్మ డెయిరీని ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది ప్రభాకర్, వలంటీర్లు పాల్గొన్నారు.

టౌన్‌బ్యాంకు ద్వారా మెరుగైన సేవలు

అనంతపురం అగ్రికల్చర్: ఖాతాదారుల శ్రేయస్సే లక్ష్యంగా 'ది అనంతపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు (టౌన్ బ్యాంకు)' ద్వారా మరింత మెరుగైన సేవలు అందిస్తామని బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్ తెలిపారు. శుక్రవారం పాలకవర్గం సభ్యులతో కలిసి స్థానిక బ్యాంకు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 107 ఏళ్ల చరిత్ర కలిగిన టౌన్ బ్యాంకులో ఖాతాదారుల డిపాజిట్లకు అత్యధిక వడ్డీరేట్లు వర్తింపజేయడంతో పాటు ఆర్థిక భద్రత కల్పిస్తామన్నారు. ఖాతాదారులకు 7.75 శాతం, సీనియర్ సిటిజన్లకు 8.25 శాతం వడ్డీరేటు ఉందన్నారు. ప్రస్తుతం బ్యాంకు టర్నోవర్ రూ.700 కోట్ల మార్క్‌ను అధిగమించగా, అందులో రూ.100 కోట్లు డిపాజిట్లు ఉన్నాయన్నారు. నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) 27 శాతం నుంచి 6 శాతానికి తగ్గించడంతో గత ఆర్థిక సంవత్సరంలో రూ.4.14 కోట్లు మేర నికరాదాయం సాధించినట్లు తెలిపారు. త్వరలోనే గుంతకల్లు, కదిరి, నార్పల లేదా గోరంట్ల, జిల్లా కేంద్రంలో కేవలం మహిళలకే ప్రత్యేక బ్రాంచ్ ఏర్పాటుకు చర్యలు తీసుకంటామన్నారు. హౌసింగ్, గోల్డ్‌లోన్ కింద రూ.106 కోట్ల మేర రుణాలు ఇచ్చామని తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్లు కె.కృష్ణకుమార్, బి.రమణయ్య, డైరెక్టర్లు సుంకర రమేష్, వడ్డే వెంకటాద్రి, చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యం, చింతా భాస్కర్, గోల్డ్ బాషా, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైనవే విక్రయించండి

అనంతపురం అగ్రికల్చర్: నిబంధనలకనుగుణంగా రైతులకు నాణ్యమైన పురుగు మందులు, ఎరువులు, విత్తనాలు, ఇతరత్రా ఇన్‌పుట్స్ అందించాలని డీఏఓ ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. శుక్రవారం ఏడీఏ రవి, రూరల్ ఏఓ శశికళ, టెక్నికల్ ఏఓ బాలనాయక్‌తో కలిసి స్థానిక అవంతి అగ్రో ఏజెన్సీస్ దుకాణంలో తనిఖీ చేశారు. లైసెన్సులు, స్టాక్, సేల్స్, రైతుల బిల్లులు, ఇన్‌వాయిస్‌లు పరిశీలించారు. నాణ్యతకు అధిక ధరలకు ఫిర్యాదులు వస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని డీఏఓ హెచ్చరించారు.

నేటి నుంచి బియ్యం విక్రయం

అనంతపురం అర్బన్: బియ్యం ధర మార్కెట్‌లో పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు అనుకూల ధరతో రైతు బజారులో శనివారం నుంచి విక్రయించేలా చర్యలు చేపట్టామని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు. ఇందుకు సంబంధించి వివరాలను శుక్రవారం తెలియజేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో బియ్యం ధర కిలో రూ.56 ఉందన్నారు. రైస్ మిల్లర్లు, హోల్ సేల్ ట్రేడర్లతో సమీక్షించి ప్రజలకు అనుకూలంగా ఉండేలా కిలో రూ.48తో కుటుంబానికి 10 కిలోలు అందించాలని నిర్ణయించామన్నారు. రైతు బజారులో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు.

నాలుగేళ్లలోనే నలభై ఏళ్ల సంక్షేమం



సమస్యలను తెలుసుకుంటున్న మేయర్, ఉర్దూ అకాడమీ చైర్మన్, వక్ఫ్‌బోర్డు చైర్మన్

అనంతపురం సిటీ: నాలుగేళ్ల పాలనలోనే 40 ఏళ్ల సంక్షేమం సాధ్యమైందని నగర మేయర్ వసీం, ఉర్దూ అకాడమీ చైర్మన్ హిరియల్ నదీమ్ అహమ్మద్, వక్ఫ్ బోర్డు చైర్మన్ కాగజీఘర్ రిజ్వాన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లా బేగ్, మార్కెట్ యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్ అన్నారు. శుక్రవారం అనంతపురం అర్బన్ నియోజకవర్గంలోని పాతూరులోని నాల్‌బంద్ వీధిలోని మసీద్ ఏ ఇమామే ఆజామ్ మసీదులో 'హర్ దిల్ మే వైఎస్సార్-హమ్ సబ్ జగన్‌కే సాత్' కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం మత పెద్దలు, మసీదు కమిటీ సభ్యులు, ముస్లింలతో వారు సమావేశమయ్యారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రహంతుల్లా, ఇషాక్, కో-ఆప్షన్ సభ్యుడు షంషుద్దీన్, పార్టీ నాయకులు ముహేబ్, మహబూబ్‌బాషా, మసీదు ముతవల్లి హబీబుల్లా, మసీదు ఇమామ్ జునైద్, మసీదు కమిటీ సభ్యులు ఆసిఫ్, జిల్లాన్, పర్వాజ్, బాబు, అన్సార్ పాల్గొన్నారు.

'నోటికొచ్చినట్లు వాగితే బుద్ధి చెబుతాం'

అనంతపురం సిటీ: ప్రభుత్వం పిలుపు మేరకు తమ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన 'హర్ దిల్ మే వైఎస్సార్-హమ్ సబ్ జగన్‌కే సాత్' కార్యక్రమం ఓ గొప్ప యజ్ఞమని, ఇలాంటి కార్యక్రమంపై నోటికొచ్చినట్లు వాగితే బుద్ధి చెబుతామని టీడీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ముస్తక్ మౌలానా అహమ్మద్‌ను మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లా బేగ్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ముస్తక్ ప్రకటనలపై తీవ్ర అభ్యంతరం తెలిపారు. అభివృద్ధి-సంక్షేమం రెండు కళ్లగా ముందుకెళ్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక టీడీపీ నేతలు ఇలాంటి చవకబారు వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. చంద్రబాబు నాయుడు దృష్టిలో పడేందుకు వాస్తవాలు వక్రీకరించి, నోటికొచ్చినట్లు వాగితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

చీనీ మార్కెట్ సందర్శన

అనంతపురం అగ్రికల్చర్: సీపీఎం అనుబంధ ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణయ్య, ప్రభాకర్ రెడ్డి స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో చీనీ మార్కెట్‌ను శుక్రవారం సందర్శించారు. వ్యాపారులు, రైతులతో మాట్లాడారు. ఈనామ్ అమలు చేస్తున్నా రైతుకు గిట్టుబాటు ధర కల్పించలేదని విమర్శించారు. వ్యాపారులే సిండికేట్‌గా మారి ధర నిర్ణయిస్తూ రైతులకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో పండ్లతోటల రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆర్‌బీకే వేదికగా రైతుకు ప్రయోజనాలు

అనంతపురం అగ్రికల్చర్: గ్రామ గ్రామనా ఏర్పాటు చేసిన ఆర్‌బీకేలు వేదికగా రైతుకు విస్తృత ప్రయోజనాలు కల్పిస్తున్నట్లు రూరల్ ఏఓ శశికళ తెలిపారు. శుక్రవారం స్థానిక కృషి భవన్‌లో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి (అగ్రి అడ్వయిజరీ బోర్డు) సమావేశం నిర్వహించారు. ఏఓ శశికళతో పాటు చైర్మన్ ఆలమూరు సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం విత్తన వేరుశనగ, ఇతర విత్తనాలు రాయితీతో పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

ఆత్మకూరు: మండలంలోని సనప ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు రామాంజనేయులు, తిమ్మప్ప, సరస్వతి, శ్రీనివాసులు, సుజాత, చంద్రశేఖర్‌ను శాలువా కప్పి సన్మానించారు. ఇన్‌చార్జ్ హెచ్ఎమ్ అనురాధ, ఉపాధ్యాయులు రమణారెడ్డి, నాగరాజు ప్రభాకర్, లలిత పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

రాప్తాడు: ఈనెల 31వ తేదీలోపు ఈకేవైసీ నమోదు చేయించుకోవాలని ఏఓ వెంకటేశ్వర ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి వ్యవసాయ సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల అగ్రిబోర్డు చైర్మన్ కేశవ రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్ సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

అనంతపురం క్రైం: సీజనల్ వ్యాధులపై నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మేయర్ వసీం పేర్కొన్నారు. శుక్రవారం 49వ డివిజన్ పరిధిలో జరుగుతున్న డ్రైడే కార్యక్రమాన్ని మేయర్ వసీం పరిశీలించారు. ఎప్పటికప్పుడు పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలని ఎంహెచ్ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డిని మేయర్ ఆదేశించారు.

ఫీవర్ సర్వే పక్కాగా చేయాలి: దోమకాటుతో వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రభుత్వం చేపట్టిన ఫీవర్ సర్వే పక్కాగా చేపట్టాలని పారిశుధ్య కార్యదర్శులు, ఏఎన్ఎం, ఆశా వర్కర్లను మేయర్ ఆదేశించారు. కార్పొరేటర్లు మునిశేఖర్, శ్రీనివాసులు, అనిల్‌కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుడికి అభినందన

అనంతపురం: అనంతలక్ష్మీ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన కంప్యూటర్ సైన్సు విభాగం ప్రొఫెసర్ డాక్టర్ కే మురళీధర్‌ను జేఎన్‌టీయూ అనంతపురం వీసీ జింకా రంగజనార్దన , రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఈశ్వర్ రెడ్డి సన్మానించారు. ఆయన కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) అనే పుస్తకాన్ని రచించగా, ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన స్ప్రింజర్ అనే ప్రచురణ సంస్థ ఈ పుస్తకాన్ని ప్రచురించింది. అనంతలక్ష్మీ ఇంజినీరింగ్ కళాశాల వైస్ చైర్మన్ ఎం.రమేష్ నాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మూర్తిరావు, స్కిల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ సురేంద్రనాయుడు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామమూర్తి, అకడమిక్ డీన్ డాక్టర్ నాగసుబ్బరాయుడు పాల్గొన్నారు.

ప్రాణాపాయస్థితి నుంచి కాపాడాలి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: గుండెపోటు.. ఇతర అనారోగ్య సమస్యలతో ఎవరైనా తారసపడితే పోలీసు సిబ్బంది స్పందించాలని ఎస్పీ కె. శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన సివిల్, ఏఆర్, ట్రాఫిక్, హోంగార్డులకు పోలీసు పరేడ్ మైదానంలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఓపెన్ ఫిడే రేటింగ్ చెస్ చాంపియన్‌షిప్



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ శ్రీనివాస రావు

అనంతపురం: రాష్ట్రస్థాయి అండర్-15 ఓపెన్ ఫిడే రేటింగ్ చెస్ చాంపియన్‌షిప్ -2023 పోటీలు ఆగస్టు 24 నుంచి 27 తేదీ వరకు కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నారు. ఏ-1 చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ పోటీల బ్రోచర్‌ను జిల్లా ఎస్పీ కే శ్రీనివాస రావు శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ కార్యదర్శి ఏ ఉదయ్‌కుమార్ నాయుడు, చైర్మన్ బాలరాజు, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్ డాక్టర్ సుప్రజా చౌదరి, కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ , పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శంకరయ్య పాల్గొన్నారు.

ముగిసిన పశుగ్రాస వారోత్సవాలు

అనంతపురం అగ్రికల్చర్: పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఈనెల 7 నుంచి చేపట్టిన పశుగ్రాస వారోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. వారం రోజుల పాటు పాడి, పశుపోషణలో పశుగ్రాసం ప్రాముఖ్యత గురించి రైతుల్లో అవగాహన కల్పించారు. బుక్కరాయసముద్రం మండలం రెడ్డిపల్లి ప్రాంతీయ పశుశిక్షణా కేంద్రంలో ముగింపు కార్యక్రమం నిర్వహించారు. నీటి లభ్యత పుష్కలంగా ఉన్న ప్రస్తుత తరుణంలో పశుపోషణ కలిగిన ప్రతి రైతు పశుగ్రాసం పెంపకం చేపడితే అధిక పాల ఉత్పత్తి ద్వారా ఆర్థిక ఆదాయం పెరుగుతుందని ఆ శాఖ జేడీ వై.సుబ్రహ్మణ్యం తెలిపారు.

టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

రాప్తాడురూరల్: టీచర్ల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఏపీటీఎఫ్ అనంతపురం జిల్లా శాఖ సబ్ కమిటీ సమావేశం అనంతపురం ఉపాధ్యాయ భవన్‌లో జిల్లా అధ్యక్షులు వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. ఏపీటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి సిరాజుద్దీన్, ఉపాధ్యక్షులు గాయత్రి, సతీష్, సుభద్ర, రాష్ట్ర కౌన్సిలర్లు వెంకటరమణ, అంజలి దేవి, సర్దార్ వలి, ఓబులేష్ పాల్గొన్నారు.

క్రియాయోగంతోనే మానసిక ప్రశాంతత



యోగా విశిష్టతను వివరిస్తున్న స్వామి స్మరణానందగిరి

అనంతపురం కల్చరల్: క్రియాయోగంతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రఖ్యాత యోగా గురువు స్వామి స్మరణానందగిరి ఉద్బోధించారు. అనంత వేదికగా మూడు రోజుల పాటు వైఎస్ఎస్ఎస్ (యోగదా సత్సంగ మండలి) ఆధ్వర్యంలో సాగనున్న యోగా ప్రక్రియ సాధనా సమావేశాలు శుక్రవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక కృష్ణకళా మందిరంలో జరిగిన తొలిరోజు కార్యక్రమానికి యోగదా సత్సంగ సొసైటీ ఆఫ్ ఇండియా జాతీయ ఉపాధ్యక్షులు స్వామి స్మరణానంద గిరి విశిష్ట అతిథిగా విచ్చేసి పరమహంస యోగానంద జీవిత ప్రాముఖ్యాన్ని, క్రియా యోగ సాధన ప్రయోజనాలను వివరించారు. యోగదా సత్సంగ మండలి జిల్లా ప్రతినిధులు చంద్రశేఖర్, నరసింహులు, సురేష్ తదితరులు మాట్లాడారు.

వైభవంగా చివరి అలంకార సేవలు

అనంతపురం కల్చరల్: పవిత్ర ఆషాఢ మాసంలో వచ్చిన చివరి శుక్రవారం కావడంతో సాయంత్రం నుంచి రాత్రి వరకు పలు ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. సామూహిక లలితా సహస్ర నామాలు, భక్తిగీతాలతో అమ్మవారిని ఆరాధించారు. ఆరో రోడ్డులోని మృత్యుంజయ శివాలయంలో పార్వతీ మాత , సాయినగర్‌లోని కనకదుర్గ అమ్మవారు శాకంబరీ సేవల్లో దర్శనమిచ్చారు. వాసవీ మహిళా మండలి నేతృత్వంలో ప్రత్యేక పూజలు, వివిధ రకాల కూరగాయలతో అమ్మవారికి అలంకార సేవలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అమ్మవారి నైవేద్యం అందించారు.